క్లుప్తంగా

శాస్త్రీయ దృక్పథాన్ని అలవరుచుకోవాలి

బూర్గంపాడు: శాస్త్ర, సాంకేతిక రంగాల్లో వస్తున్న పరిణామాలకు అనుగుణంగా విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవరుచుకోవాలని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు కె.వీరభద్రం అన్నారు. బూర్గంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యవక్తగా పాల్గొన్న జువాలజీ లెక్చరర్ లక్ష్మీదీపిక మాట్లాడుతూ.. డార్విన్ సిద్ధాంతం జీవ పరిణామ క్రమాన్ని కళ్ల ముందు ఆవిష్కరించిందన్నారు. జీవ పరిణామ క్రమంలో ఎలాంటి అతీత శక్తుల ప్రమేయం లేదని ఇదంతా సహజ పరిణామమేనన్నారు. కార్యక్రమంలో బయ్యా రాము, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతోనే భవిష్యత్

చండ్రుగొండ: చిన్ననాటి నుంచి క్రమశిక్షణతో ఉంటేనే విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని సింగరేణి సంస్థ జనరల్ మేనేజర్ ఎం షాలెంరాజు అన్నారు. మండలకేంద్రం చండ్రుగొండలోని సెయింట్ జోసఫ్ పాఠశాల వార్షికోత్సవం శనివారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ.. ఆటలు పాటలతోపాటు చదువుపై శ్రద్ధ వహించాలన్నారు. జీవితంలో అల్లరి ఉండాలని, కాని అల్లరే జీవితం చేసుకోవద్దని విద్యార్థులకు హితవు పలికారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీ కొడకండ్ల వెంకటరెడ్డి, ఎంఈఓ సత్యనారాయణ మాట్లాడారు. విద్యార్థులు ఇచ్చిన కళా ప్రదర్శనలు ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఏ.కృష్ణారెడ్డి, ఇమ్మానియోల్, జోసఫ్, పాఠశాల కరస్పాండెంట్ అనిత, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ



లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న తహసీల్దార్ సంధ్యారాణి

చండ్రుగొండ: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు శనివారం తహసీల్దార్ సంధ్యారాణి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కల్యాణలక్ష్మికి సంబంధించి 43, షాదీముబారక్‌కు సంబంధించి 7 చెక్కులను అందించారు. ఎన్నికల కోడ్ అమల్లో నేపథ్యంలో అధికారులే పంపిణీ చేశారు.

న్యాయ కళాశాల ఏర్పాటు చేయాలి

దుమ్ముగూడెం: భద్రాచలం కేంద్రంగా న్యాయ కళాశాల ఏర్పాటు చేయడమే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రధాన ఎజెండాగా ఉండాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర కన్వీనర్ సోందే వీరయ్య పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని కొత్తపల్లి గ్రామంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏజెన్సీలో తరతరాలుగా అనిచివేత, దోపిడీకి గురవుతూ వస్తున్న ఆదిమ జాతుల కోసం భద్రాచలం కేంద్రంగా ఒక న్యాయ కళాశాల ఏర్పాటు చేయాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. మంత్రి ధనసరి సీతక్క, భద్రాచలం ఎమ్మెల్యే వెంకట్రావులు దీనికోసం ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. జీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి, ములుగు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రతాప్, చర్ల వర్కింగ్ ప్రెసిడెంట్ పూనెం వర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సైడ్ కాలువ నిర్మించాలి

మణుగూరుటౌన్: అంబేడ్కర్ చౌరస్తా నుంచి రైల్వే గేట్ వరకు రెండో సైడ్ డ్రెయినేజీని వెంటనే నిర్మించి వరదలను నియంత్రించాలని సీపీఎం మండల కార్యదర్శి సత్రపల్లి సాంబశివరావు డిమాండ్ చేశారు. శనివారం మద్దెల పద్మ ఇంటి వద్ద అనసూయ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రెండో సైడ్ డ్రెయినేజీ నిర్మాణం చేపట్టకపోవడం వల్ల వర్షాకాలంలో డ్రెయిన్ పొంగిపొర్లి వరద నీరు ఇళ్లల్లో ప్రవహిస్తోందన్నారు. దీంతో దుర్గంధం కారణంగా ప్రజలు ఇళ్లల్లో ఉండలేకపోతున్నారని, దోమలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడుతున్నారని తెలిపారు. వెంటనే సైడ్ డ్రెయినేజీ నిర్మించి, అంతర్గత డ్రెయినేజీ వ్యవస్థను నిర్మాలించాలని డిమాండ్ చేశారు. దామల్ల వెంకన్న, దొడ్డి నిర్మల, అలవాల కమలమ్మ, విజయ, ఐలమ్మ, స్వరూప పాల్గొన్నారు.

వినతుల వెల్లువ

దమ్మపేట: మండల పరిధిలోని గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు, తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ, పలువురు వినతి పత్రాలను అందజేశారు. శనివారం గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు, ఎమ్మెల్యే జారేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు.. తమ సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు. గ్రామస్తుల సమస్యలను ఓపికగా విన్న ఎమ్మెల్యే, సంబంధిత అధికారులతో ఫోన్‌లైన్‌లో మాట్లాడి, సమస్యలను పరిష్కరించాలని సూచించారు.



సమ్మక్క-సారలమ్మ ఆలయ స్వాగత తోరణం



ముస్తాబైన ఆలయం



జాతరకు సిద్ధమైన పగిడిద్దరాజు గద్దె

జాతరకు పోదాం రండి..

11 నుంచి చిరుమళ్లలో సమ్మక్క-సారలమ్మ జాతర
- హాజరుకానున్న 4 రాష్ట్రాల భక్తులు
- కేంద్ర, రాష్ట్ర మంత్రులకు ఆహ్వాన పత్రికలు

సండే స్పెషల్



వన దేవతలను తీసుకువస్తున్న పూజారులు, భక్తులు (ఫైల్)

కరకగూడెం: జాతరలు గిరిజన సంస్కృతిలో అంతర్భాగం. అవి వారిలో ఆధ్యాత్మికత, సాంస్కృతిక వారసత్వం,సామాజిక బంధాలను బలోపేతం చేస్తాయి. ఈ క్రమంలో కోరిన కోర్కెలను తీర్చే వనదేవత జాతరకు సమయం ఆసన్నమైంది. కరకగూడెం మండల పరిధిలోని చిరుమళ్ల గ్రామంలో ఎంతో ఘన చరిత్ర ఉన్న సమ్మక్కసారలమ్మ జాతర సందడి ప్రారంభం కానుంది. భక్తజనం వన దేవతలకు మొక్కులు చెల్లించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ నెల 11 నుండి 15వ తేది వరకు జాతర జరగనుంది.

ఇదీ జాతర నేపథ్యం..

కోయ వారి ఇలవేల్పు, ఆదిశక్తి లోకమాత సమ్మక్క దేవత చిరుమళ్ల గ్రామంలో చందా వంశస్థుల ఇంట్లో బండాని రాజు-చంద్రమ్మ దంపతులకు జన్మించింది. సమ్మక్క దేవతకు నలుగురు అన్నదమ్ములు. ఒక రోజు వారి నానమ్మ చిలకమ్మ దుంపల కోసం అడివికి వెళ్లి చనిపోయింది. ఈ నేపథ్యంలో సమ్మక్క దేవత తన పెళ్లికి తల్లిదండ్రులు ఇచ్చిన అభరణాలు, ఇతర వస్తువులను అన్నదమ్ములకు సమానంగా పంచి.. ప్రతి యేడాది ఒకరు చొప్పున నానమ్మ జ్ఞాపకార్థంగా తన పేరుతో జాతరను జరపాలని చెప్పినట్టు పెద్దలు చెప్పుకొస్తున్నారు. మేడారం జాతర జరిగిన మరుసటి యేడాది ఇక్కడ జాతర ప్రారంభంకానుంది. అటవీ ప్రాంతంలోని ముసలమ్మ గుట్టపై ఉన్న గుహలో సమ్మక్క దేవత వస్తువులను దేవరబాలలు తీసుకొచ్చి నిండు జాతరను ఘనంగా నిర్వహిస్తారు. ఈ జాతరను సుమారు వందల సంవత్సరాల నుంచి నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ప్రజలందరూ సుఖ సంతోషాలు, పాడి పంటలతో కళకళలాడాలని కోరుతూ.. ఇక్కడ జాతరను ప్రతీ సారి ఘనంగా నిర్వహిస్తుంటారు. భారీ సంఖ్యలో జాతర జరుగు ప్రాంతంలో దుకాణాలు వెలుస్తుంటాయి. చిన్న, పెద్ద తేడా లేకుండా పెద్ద సంఖ్యలో ప్రజలు జాతరలో పాల్గొంటారు.

ప్రారంభమైన ఉపవాస దీక్షలు

సమ్మక్క దేవత అదృశ్యమయ్యే ముందు గ్రామస్తులతో కార్తీక పౌర్ణమి రోజు.. అనగా తాను పుట్టిన రోజు గ్రామస్తులంతా ఉపవాస దీక్ష చేస్తూ.. సూర్యస్తమయ సమయంలో సూర్యునికి ఎదురుగా ప్రార్థిస్తే ఎర్రటి పొద్దులో తాను కనబడి దీవిస్తానని చెప్పినట్లు పూర్వీకులు వెల్లడిస్తున్నారు. ఈ నేపథ్యంలో సమ్మక్కసారలమ్మ ఉపవాస దీక్ష ఉత్సవాలు గత నెల జనవరి 26 నుంచి ప్రారంభమయ్యాయి. ఈ నెల 16వ తేదీ వరకు అంటే 21 రోజుల పాటు కొనసాగనున్నాయి.

ముమ్మరంగా ఏర్పాట్లు..

కాగా, ఈ జాతరకు ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒరిస్సా, తెలంగాణలో వివిధ ప్రాంతాల నుంచి భక్త జనం రానున్నారు. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు ఇటీవల ఐటీడీఏ పీఓ రాహుల్ జాతర జరిపే ప్రాంతాన్ని, ఆలయాన్ని సందర్శించి గ్రామస్తులతో సమావేశమయ్యారు. జాతరను వైభవంగా నిర్వహించడానికి తగు ఏర్పాట్లు చేస్తానని హామీ ఇచ్చి మండల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కొంత మొత్తంలో పనులను ప్రారంభించారు. అదేవిధంగా ఆలయ కమిటీ సభ్యులు జాతర ప్రాముఖ్యతను, విశిష్టతను ఇటీవల కేంద్ర, రాష్ట్ర మంత్రులతో పాటు గొవర్నర్ దృష్టికి తీసుకెళ్లి జాతర ఆహ్వాన పత్రికలను అందజేశారు. జాతర నిర్వహణకు ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎటువంటి సహాయ సహకారాలు లేవని ప్రభుత్వం గుర్తించి జాతర నిర్వహణకు నిధులు కేటాయించి మినీ మేడారం లాగా చేయాలనీ గ్రామస్తులు వేడుకుంటున్నారు.

జాతర వివరాలు..

- **11వ తేదీన మంగళవారం..** జాతర ప్రారంభోత్సవం జరుగుతుంది. దేవతకు కుంకుమ పూజలు, అర్చనలు, అభిషేకాలులు, గుడి మేలుకొలుపు వంటివి రాత్రి 12:00 గంటల వరకు జరుగుతాయి.
- **12న బుధవారం..** ఒక్కపొద్దు ఉంటుంది. ఉదయం 10:00 గంటలకు సమ్మక్క ఇలవేల్పులు వస్తాయి. పగలు దూరప్రాంతాల నుంచి సాయత్రం వరకు ఇలవేల్పులు చేరుకుంటాయి.
- **13న గురువారం..** నిండు జాతర జరుగుతుంది. మధ్యాహ్నం 1:30 నిమిషాలకు వన దేవత, తల్లి దేవత గుట్టనుంచి గుడికి వస్తుంది. కోలాహాలతో ఎదురుకోలు జరుగుతుంది. రాత్రి 1:30నిమిషాలకు శ్రీ సమ్మక్క దేవతకు పగిడిద్ద రాజుతో కల్యాణం జరుగుతుంది.
- **14న శుక్రవారం..** శుంకు పండగ దైవ దర్శనం ఉంటుంది. భక్తులు మొక్కులు చెల్లించుకుంటారు.
- **15న శనివారం..** తల్లి దేవత గుడి నుంచి గుట్టకు వెళ్తుంది. అక్కడితో మహోత్సవంగా జరిగిన జాతర ముగుస్తుంది.

బ్రహ్మోత్సవాలను వైభవంగా జరిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏరియా జీఎం రామచందర్

మణుగూరురూరల్: మార్చి ఒకటో తేదీ నుంచి జరగబోయే శ్రీవారి బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా జరిపించాలని సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా జీఎం దుర్గం రామచందర్ అధికారులకు సూచించారు. శనివారం ఏరియా జీఎం కార్యాలయ సమావేశ మందిరంలో అధికారులు, ఆలయ కమిటి సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మార్చి ఒకటో తేదీ నుండి 4వ తేదీ వరకు శ్రీవెంకటేశ్వర స్వామి వారి 10వ వార్షిక బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాల విజయవంతానికి అధికారులు, కార్మిక సంఘాల నాయకులు, ఉద్యోగులు, ఆలయ కమిటీ సభ్యులు కృషి చేయాలన్నారు. బ్రహ్మోత్సవాల్లో పాల్గొనే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లుచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో పీకేఓసీ పీఓ టి.లక్ష్మీపతిగౌడ్, మణుగూరు ఓసీ పీఓ శ్రీనివాసచారి, ఏజీఎం(సివిల్) డి.వెంకటేశ్వర్లు, ఏరియా ఇంజనీర్ ఆర్.శ్రీనివాస్, డీజీఎం (పర్సనల్) ఎస్.రమేష్, డీజీఎం (ఐఈడీ) వెంకట్రావు, డీజీఎం(ఫైనాన్స్) అనురాధ, జీఎం(కేసీహెచ్‌పీ) మధన్ నాయక్, డాక్టర్ శేషగిరిరావు, ఏరియా సెక్యూరిటీ అధికారి కె.శ్రీనివాస్, కార్మిక సంఘాల నాయకులు వై.రాంగోపాల్, వి.కృష్ణంరాజు, నాగెల్లి వెంకటేశ్వర్లు, సీనియర్ పీఓ సింగు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయాలి

చర్ల: ఏజెన్సీలో రైతులు సాగు చేసిన వందలాది ఎకరాల మిర్చి పంటకు తెగుళ్లు వ్యాపించి నష్టపోతున్నారని, అటువంటి పంటలను పరిశీలించి ప్రభుత్వం వారిని పరిహారం చెల్లించి ఆదుకోవాలని బీఎస్పీ చర్ల మండల అధ్యక్షుడు కొండా కౌశిక్ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో రైతులు సాగు చేసిన మిర్చి పంటలను ఆయన పరిశీలించారు. అనంతరం కొండా కౌశిక్ మాట్లాడారు. దెబ్బతిన్న పంటల విషయంలో ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మడల ఇన్‌చార్జ్ ప్రవీణ్, పార్టీ మండల కార్యదర్శి నక్కా సాంబయ్య రైతులు కొండయ్య, రమణ, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.


పీఆర్‌పీ చెల్లించాలి



ఏరియా జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న అధికారులు

మణుగూరుటౌన్: 2022–23 సంవత్సరంలో అధికారులందరి జీతాల్లో భాగమైన పీఆర్‌పీ (పర్ఫార్మెన్స్ రిలేటెడ్ పే) సంబంధిత చెల్లింపులు చేయాలని కోరుతూ.. ఏరియా జీఎం దుర్గం రాంచందర్‌కు జీఎం కార్యాలయ ఆవరణలో అధికారులతో శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఎంఓఏఐ అధ్యక్షుడు లక్ష్మీపతిగౌడ్ మాట్లాడుతూ.. కోల్ ఇండియాలో జూన్ 2024లో పీఆర్‌పీ చెల్లించినప్పటికీ సింగరేణిలో ఇప్పటి వరకు చెల్లించకపోవడం వల్ల అధికారులు తీవ్ర అసంతృప్తిగా ఉన్నారన్నారు. అదేవిధంగా గతేడాది నవంబర్‌లో జరిగిన అధికారుల సంఘం సమావేశంలో యాజమాన్యం దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి వెంటనే తగిన ఆదేశాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏరియాలోని అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

బీజేపీ సంబరాలు



ములకలపల్లిలో మిఠాయిలు పంచుతున్న బీజేపీ నాయకులు

సాక్షినెట్‌వర్క్: ఢిల్లీ పీఠాన్ని బీజేపీ కైవసం చేసుకోవడంతో పార్టీ శ్రేణులు పలు మండలాల్లో శనివారం సంబురాలు చేసుకున్నారు. బాణాసంచా కాల్చి సందడి చేశారు. ఒకరికొకరు స్వీట్లు తినిపించుకున్నారు.

కార్పొరేట్లకే అనుకూలం

ములకలపల్లి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌తో నిరుపేదలకు ఒరిగిందేమని లేదని, కార్పొరేట్లకే అనుకూలంగా ఉందని సీఐటీయూ మండల కన్వీనర్ నిమ్మల మధు విమర్శించారు. శనివారం సంఘం ఆధ్వర్యంలో మండలకేంద్రంలో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గడదాసు గోపాల్‌రావు, భూక్యా భద్రు, బొర్రా లలిత, మద్దెల యోగి, నాగేశ్, రామకృష్ణ, సున్నం కృష్ణ పాల్గొన్నారు.

బొడ్రాయి వార్షికోత్సవం

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామ పంచాయతీలో ఎస్సీ కాలనీలో బొడ్రాయి(నాభిశిల) తృతీయ వార్షిక మహోత్సవ పూజా కార్యక్రమాలు శనివారం స్థానికులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పూజారుల వేదమంత్రాల మధ్య గ్రామస్తులు బొడ్రాయి వద్ద జలాభిషేకం, యజ్ఞహోమం, ప్రత్యేక పూజలు చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు. కేసుపాక నాగేశ్వరరావు, దేవంగి వెంకటరమణ, కదారి వేణు, నందిపాటి సైదులు, కదారి రమేష్, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

ఆధార్ సేవలను అందుబాటులోకి తేవాలి

మణుగూరురూరల్: గత కొంతకాలంగా నిలిచిపోయిన ఆధార్ సేవలను తిరిగి ప్రజలకు అందుబాటులోకి తేవాలని బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ కుర్రి నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. లక్ష జనాభా కలిగిన మండలంలో ప్రభుత్వ మీసేవలో, అంబేడ్కర్ సెంటర్‌లోని ఎస్‌బీఐలో నిర్వహిస్తున్న ఆధార్ సేవలు కొంత కాలంగా పని చేయడం లేదన్నారు. ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ స్పందించి మణుగూరులో ఆధార్ సేవలను పునరుద్ధరించి ప్రజల ఇబ్బందులను తొలగించాలని డిమాండ్ చేశారు.

సద్వినియోగం చేసుకోవాలి

ములకలపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఐకేపీ ఏపీఎం సంపత్‌కుమార్ సూచించారు. మండలపరిధిలోని పూసుగూడెంలో ఎస్‌హెచ్‌జీ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన ఆర్థిక అక్షరాస్యతా అవగాహన సదస్సులో పాల్గొన్న ఆయన మాట్లాడారు. బ్యాంకుల్లో అందిస్తున్న వివిధ రకాల పాలసీలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. సెంటర్ ఫర్ ఫైనాన్షియల్ లిటరసీ కౌన్సిలర్ నవీన్‌బాబు, సీసీ చిన్నమ్మ, ఎస్‌హెచ్‌జీ వీఓఏ మహాలక్ష్మి, వీఓ సభ్యులు పాల్గొన్నారు.

ఆలయంలో పూజలు

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలో ఉన్న దాసాంజనేయ స్వామి వారి దేవాలయంలో శనివారం భీష్మ ఏకాదశి, దాసాంజనేయ స్వామి వారి వార్షిక మహోత్సవం ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆరుట్ల రాజగోపాల్‌చార్యులు స్వామివారికి విశేష పంచామృతాభిషేకం, అష్టోత్తర సహస్రనామార్చన అనంతరం భక్తులచేత హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. తీర్థప్రసాదాలను స్వీకరించారు.

నులి పురుగులను నలిపేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారులు మధు, రవితేజ

కరకగూడెం: నులిపురుగుల నివారణ ద్వారా పిల్లలను ఆరోగ్యంగా ఉంచడమే కాకుండా వారి భవిష్యత్తును మెరుగుపరచవచ్చని కరకగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు కారం మధు, రవితేజ పిలుపునిచ్చారు. ఈ మేరకు వారు శనివారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి త్వరలో జరిగే నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1 నుంచి 19 సంవత్సరాల పిల్లలకు తప్పకుండా నులిపురుగల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈఓ కృష్ణయ్య, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ద్వితీయ ఊరేగింపు

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం గ్రామంలో జరుగుతున్న ముత్యాలమ్మ అమ్మవారి 23వ జాతర మహోత్సవం శనివారం ఆరో రోజుకు చేరుకుంది. ఆరో రోజు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం దాతలు అందచేసిన ఆర్థికసాయంతో భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం 4 గంటలకు ఆలయానికి చేరుకున్న భారీ భక్తుల సందడితో అమ్మవారి ద్వితీయ ఉరేగింపును చేపట్టారు. మేళతాళాలు, డప్పు వాయిద్యాలతో గ్రామంలోని యువకులు అడవేషధారణతో అమ్మవారి గరిగెలను తలపై పెట్టుకుని పురవీధుల్లో ఊరేగింపు చేశారు. ఊరేగింపుకు గరిగెలు బయల్దేరే క్రమంలో ఆలయంలోని ధ్వజస్తంభం పైన ఉన్న గంటలు మోగి అమ్మవారి నిజరూపాన్ని ప్రదర్శించింది. సాయంత్రం నుండి రాత్రి వరకు ఊరేగింపు భక్తుల కోలాహలం నడుమ సందడిగా సాగింది. జాతరకు సీఐ అశోక్ పర్యవేక్షణలో ఎస్ఐలు వెంకటప్పయ్య, గణేష్‌లు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లను చేశారు. ఆలయానికి వచ్చే భక్తులకి ఎటువంటి ఇబ్బంది కలుగకుండా ఆలయ కమిటీ చైర్మన్ చుక్క గణేష్ రెడ్డి అధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

కుష్ఠు వ్యాధి నిర్మూలనకు పాటుపడదాం



స్పర్శ లెప్రసీ ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

మణుగూరురూరల్: ప్రతీ ఒక్కరు కుష్ఠు వ్యాధి నిర్మూలనకు పాటుపడాలని మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సునీల్ తెలిపారు. మండలంలోని సమితిసింగారం గ్రామపంచాయితీ తదితర ప్రాంతాల్లో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ డాక్టర్ సునీల్ మాట్లాడుతూ.. కుష్ఠు వ్యాధిని ఆదిలోనే గుర్తించి తగిన మందులను వాడడం ద్వారా నివారించవచ్చన్నారు. ముదురు రాగి రంగు మచ్చలుండి స్పర్శ లేని వారు ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చి పరీక్షలు చేయించుకోవాలని, వ్యాధి నిర్ధారణ అయితే మందులు వాడి నయం చేసుకోవాలని సూచించారు. అనంతరం స్పర్శ లెప్రసీ ప్రతిజ్ఞ చేయించారు. సమితిసింగారం సబ్ సెంటర్‌లో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన సందర్శించి పరిశీలించారు. జాగ్రత్తలను సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జానకి, వైద్యసిబ్బంది రాంప్రసాద్, పుష్ప, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

కుంటుపడుతున్న అభివృద్ధి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రేగా కాంతారావు

గుండాల: తెలంగాణ రాష్ట్రంలో అసమర్థ కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి కుంటుపడుతుందని, సంక్షేమ పథకాలు గాలికి వదిలేశారని పినపాక మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు అన్నారు. శనివారం ఆయన మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ.. కేసీఆర్, కేటీఆర్‌లు ప్రశ్నిస్తే కేసులు పెట్టి జైల్లో పెట్టించే ఆలోచనలో ఉన్నారని, అక్రమ అరెస్టులు చేయిస్తున్నారని అన్నారు. పొంగులేటి ఇంట్లో ఈడీ సోదాలు చేసి, కేసులు లేకుండా చేశారని అన్నారు.నాడు గుడ్డు కాలంలోనైనా రైతుబంధు ఆపిన దాఖలాలు లేవని, ఇప్పుడు ఒక్కపైసా ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులు పల్లెలకు పోతే తరిమికొడతారని ఎద్దేవా చేశారు. పినపాక నియోజక వర్గంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న కాలంలో వేలకోట్లు తీసుకువచ్చి అభివృద్ధి పనులు చేయించినట్లు తెలిపారు. ప్రస్తుత ఎమ్మెల్యే పెండింగ్‌లో ఉన్న పనులు చేయించలేకపోతున్నారని, నియోజక వర్గానికి పైసా నిధులు తీసుకవచ్చే పరిస్థితి లేదని విమర్శించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండల నాయకులు తెల్లం భాస్కర్, రవీందర్, మోకాళ్ల వీరస్వామి, గడ్డం వీరన్న, అటికం నాగేశ్వరరావు, బూక్యాశ్రీను, టి.రాము, నిట్టా రాములు, గడ్డం రమేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ హామీలను నమ్మడం లేదు..

మణుగూరురూరల్: కాంగ్రెస్ పార్టీ హామీలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు శనివారం సోషల్ మీడియా వేదికగా అన్నారు. ఢిల్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన గ్యారెంటీలను ప్రజలు అసలు పరిగణలోకి తీసుకోలేదన్నారు. ఢిల్లీ తాజా ఫలితాల్లో కాంగ్రెస్ ఓటమిని ఇందుకు రుజువుగా వర్ణించారు.

జర్నలిస్ట్ కప్ విజేత అగ్నిమాపక జట్టు



గెలుపొందిన అగ్నిమాపక జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న అధికారులు

పినపాక: మండల పరిధిలో గోపాలరావు పేట గ్రామంలో పినపాక ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో గత ఐదు రోజుల నుంచి నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ శనివారం ముగిసింది. తుది పోరులో అగ్నిమాపక జట్టు, భద్రాద్రి పవర్ ప్లాంట్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ జట్లు తలపడ్డాయి. విజేతగా అగ్నిమాపక జట్టు నిలిచింది. విజేతలకు తహసీల్దార్ నరేష్, ఎంపీఓ వెంకటేశ్వరరావు, అగ్నిమాపక డీఎస్పీ క్రాంతి కుమార్ బహుమతులు అందజేశారు. అధికారులు విధి నిర్వహణలో బిజీగా ఉంటూ కొంతమేర ఉపశమనం పొందటానికి విలేకరులు ఏర్పాటు చేసిన ఈ టోర్నమెంట్ దోహదపడిదన్నారు. ఇలాంటి ఎన్నో కార్యక్రమాలు ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో బీటీపీఎస్ అధికారులు, అగ్నిమాపక అధికారులు గ్రామస్తులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ముస్తాబు..



బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతున్న సత్యనారాయణస్వామి ఆలయం

బూర్గంపాడు: సారపాక సత్యధామంలోని సత్యనారాయణస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలకు ముమ్మరంగా ఏర్పాట్లు సాగుతున్నాయి. ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలను శాస్త్రోక్తంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేస్తుంది. ఆలయ పరిసరాలను శుభ్రం చేసి ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా నిర్వహించనున్న హోమాలకు యాగశాలలను నిర్మిస్తున్నారు. తెలంగాణలో ప్రసిద్ధిగాంచిన శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి 29వ వార్షిక బ్రహ్మోత్సవాలకు భక్తులు పెద్దసంఖ్యలో రానున్నారు. భక్తులకు అన్నిరకాల వసతులు, అన్న సమారాధన, ప్రసాదాల వితరణకు ఆలయ కమిటీ ముందస్తు ఏర్పాట్లు చేస్తోంది.

ఈ నెల 10వ తేదీ సోమవారం రోజున బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేయనున్నారు. అనంతరం గరుడ హోమం, పూర్ణాహుతి నిర్వహిస్తారు. 11వ తేదీ మంగళవారం ద్వారతోరణ పూజలు, కుంభారాధన, మూల మంత్రహోమాలు, మన్యు సూక్తా హోమం నిర్వహించనున్నారు. నవకలశ స్నాపనం, స్వామివారిని పెండ్లి కొడుకు చేయటం, ఎదుర్కోలు ఉత్సవం నిర్వహించనున్నారు. 12న ద్వార తోరణం, హోమాలు నిర్వహించి స్వామివారి కల్యాణం, అన్నసమారాధన కార్యక్రమం నిర్వహిస్తారు. 13న లక్ష్మీహోమం, సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు అనంతరం శోభాయాత్ర నిర్వహిస్తారు. 14న సుదర్శన హోమం, మహా పూర్ణాహుతి, చక్రస్నానం, పుష్పయాగం, పవళింపు, మహాదాశీర్వచనంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. ఈ బ్రహ్మోత్సవాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని ఆలయ కమిటీ చైర్మన్ జలగం చంద్రశేఖర్, ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు కన్నెదారి వరప్రసాద్ కోరారు.